క్లుప్తంగా

సెల్ టవర్‌కు అనుమతి ఇవ్వొద్దు



భట్టిప్రోలు: అద్దేపల్లి దళితవాడలో పంచాయతీ, గృహ యజమానుల నుంచి అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేయనున్న 5జీ సెల్ టవర్‌కు అనుమతి ఇవ్వొద్దని స్థానికులు పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.మనోజ్ కుమార్ మాట్లాడుతూ సెల్ టవర్ నిర్మాణం వల్ల ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ జీవోకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఈ సెల్ టవర్ నిర్మాణానికి అనుమతులు ఇస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిరణ్, ఏసుబాబు, ఇర్మియ, ఎలీషా, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు

రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికతో ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని రెవెన్యూ డివిజనల్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి జాన్ పీటర్ అన్నారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం మాట్లాడారు. నగరం మండలం సజ్జావారిపాలెం గ్రామ శివారు ఉలిపాలెం సమీపంలో వైన్ షాప్ ఉందని, ముందు సీసాలను పంట కాలవలు, రహదారులు.. చుట్టుపక్కల ఉండే పొలాల్లో పడవేస్తున్నారని గ్రామ ప్రజలు అర్జీ ఇచ్చినట్లు తెలిపారు. తమకు నీటి కనెక్షన్ లేకపోయినా నీటి పన్ను చెల్లించాలని నోటీసు వచ్చిందని, దీనిని రద్దు చేయాలని కోరుతూ రేపల్లె పట్టణంలోని 13వ వార్డు నివాసి వేమూరి తిరుపతిరావు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. మురుగు సమస్య పరిష్కరించాలని కోరుతూ పిరాట్లంక గ్రామం నుంచి నీలా అప్పారావు అర్జీ చేసుకున్నారన్నారు. ఇతర సమస్యలపై నిజాంపట్నం పల్లపట్ల గ్రామం నుంచి ఒక అర్జీ అందినట్లు చెప్పారు. సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారులు పరిష్కరిస్తారని చెప్పారు.

పూరిల్లు దగ్ధం



రేపల్లెరూరల్: విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధమైన ఘటన పట్టణంలోని 16వ వార్డులో సోమవారం చోటుచేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారి వై.సాంబశివరావు వివరాల మేరకు.. పట్టణంలోని ఇసుకపల్లిలో కోటా సురేష్‌కు చెందిన రాతిగోడల పూరింటిలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారంతో తమ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేసినట్లు సాంబశివరావు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.1.50లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని వెల్లడించారు.

ఎంపీ మోపిదేవి సంతాపం



రేపల్లె రూరల్: వైఎస్సార్ సీపీ నాయకుడు దాసరి కృష్ణ ఫల్గుణ్ ఆదివారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఫల్గుణ్ మృతదేహాన్ని ఆయన స్వగృహంలో సోమవారం రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీకి ఫల్గుణ్ చేసిన సేవలను కొనియాడారు. నివాళులర్పించిన వారిలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టమంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, తూనుగుంట్ల కాశీ విశ్వనాథ గుప్త, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భట్టిప్రోలు ఎంపీడీఓ ఊహా రాణి బాధ్యతలు స్వీకారం



భట్టిప్రోలు: ఎంపీడీవోగా టి.ఊహా రాణి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎంపీడీవోగా పని చేసిన జేబీవీ మల్లికార్జునరావు గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. ఇప్పటి వరకు ఈవోపీఆర్డీగా పని చేస్తున్న ఊహారాణి ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ సూపరింటెండెంట్ సీహెచ్ జలజ, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు ఆమెను కలసి అభినందనలు తెలిపారు.

వెద.. వ్యథ

- ఆయకట్టు చివరికి అందని సాగు నీరు
- కర్లపాలెంలో 882 హెక్టార్లలో వెద పద్ధతిలో వరి సాగు
- పైరు వాడిపోవడంతో రైతుల్లో ఆందోళన
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



సాగునీరు లేక తుమ్మలపల్లి గ్రామంలో వాడిపోతున్న వరిపైరు

కర్లపాలెం: రైతులు తిండి గింజలు పండించుకునేందుకు ఈ ఖరీఫ్‌లో చేపట్టిన వెద సాగు వ్యథను మిగులుస్తోంది. సకాలంలో చివరి ఆయకట్టుకు కూడా సాగునీరు అందిస్తామని పదే పదే చెబుతున్న అధికారులు, ప్రజా ప్రతినిధుల మాటలు నమ్మిన రైతులు దగా పడుతున్నారు. మండలంలో సముద్ర తీర ప్రాంతం గ్రామాలు పేరలి, తమ్మలపల్లి, పెదపులుగువారి పాలెం పరిధిలోని కాలువ చివర భూములకు ఏటా సాగు నీరందక వరి పైరు ఎండిపోయి.. రైతులు నష్టాలు చూస్తున్నారు. వెద పద్ధతిలో సాగు చేపట్టడం వల్ల కొంత మేర ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు తక్కువ నీటితో పంటలు పండించుకోవచ్చనే రైతుల ఆశలు అడియాశలుగానే మిగిలిపోతున్నాయి. ఎన్నో ప్రయాసల కోర్చి వ్యవసాయం చేస్తున్నప్పటికీ సాగు నీరు అందక పైరు ఎదుగుదల లేక వాడిపోతోంది. నీరు కావాలంటూ ప్రజాప్రతినిధులకు, అధికారులకు రైతులు మొర పెట్టుకుంటున్నా.. ఆలకించడం లేదు. నీరు అందకపోవటంతో కొంత ధాన్యం కూడా మొలకెత్త లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వెద పద్ధతిలో 882 హెక్టార్లలో వరిసాగు

మండలంలో అధికారులు తెలిపిన వివరాల మేరకు సుమారుగా 882 హెక్టార్లలో రైతులు వెద పద్ధతిలో వరి పంట సాగు చేశారు. కర్లపాలెంలో 60, నల్లమోతువారిపాలెంలో 45, చింతాయపాలెంలో 120, బుద్దాంలో 48, యాజలిలో 140, దమ్మనవారిపాలెంలో 124, పేరలిలో 62, సమ్మెటవారిపాలెంలో 68, తుమ్మలపల్లిలో 128, గణపవరంలో 73 హెక్టార్లలో వరి సాగవుతోంది.

వాడిపోతున్న వరి పైరు

మండల పరిధిలోని తుమ్మలపల్లి, పెదగొల్లపాలెంలో 128, పేరలిలో 62, చింతాయపాలెంలో 120 హెక్టార్లలో చేపట్టిన వరిసాగు సాగు నీరు అందక ఎండిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు అందించి, పైర్లను బతికించాలని ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారు స్పందించడం లేదని అంటున్నారు.



నీరు ఇంకిపోతున్న పెదపులుగువారిపాలెం టైలాండ్ చానల్

ఎకరాకు రూ.25 వేలకు పైగా పెట్టుబడి

వెద పద్ధతిలో వరిసాగు చేసేందుకు సుమారుగా ఎకరాకు రూ.25వేలు పెట్టుబడి అవుతోందని రైతులు చెప్తున్నారు. దున్నకానికి రూ.2,400, రోటావేటర్ వేసేందుకు రూ.3వేలు, పశువుల ఎరువు రూ.15వేలు, విత్తనాలు రూ.1300లు, కలుపు మందు కొట్టేందుకు రూ.3,700ల వరకు ఖర్చు చేసి సాగు చేశామని వెల్లడించారు. సాగు చేపట్టి ఇప్పటికే 30రోజుల నుంచి 40రోజుల వరకు అవుతున్నా.. వెద పెట్టిన ధాన్యం సరిగా మొలకలు రాలేదని, వచ్చిన మొలకలు కూడా ఏపుగా ఎదగక పోవడం వల్ల వారం పది రోజుల పైరు లాగానే కనపడతోందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు అల్ప పీడనం ప్రభావంతో పడుతున్న చిరు జల్లుల వల్ల కొంత మేరకు వరి పైరు ప్రాణం పోసుకుంటున్నా.. గత నాలుగైదు రోజుల నుంచి విపరీతంగా వీస్తున్న ఈదురు గాలులకు పైరు చివర్లు ఎండిపోయి.. మొక్కలు వాడిపోతున్నాయని ఆవేదన చెందుతున్నారు.

నీటి విడుదల పెంచుతాం

పేరలి టైలాండ్ చానల్‌లో నాచు, తూటికాడ అడ్డం ఉండటం వల్ల నీటి ప్రవాహం ఎక్కువగా వెళ్లడం లేదు. తూటికాడ, నాచు తొలగించి.. సరఫరా పెంచి పైర్లకు నీరందిస్తాం. కాలువ కట్టకు కింద గండిపడింది. దానికి మరమ్మతులు చేయిస్తున్నాం.

– శ్రీనివాసరావు, ఏఈ, ఇరిగేషన్

వరి పైరు వాడిపోతోంది



వెద పద్ధతిలో సాగు చేసిన వరిపైరు ఎండిపోతోంది. పీటీ చానల్ ద్వారా తుమ్మలపల్లి చానల్‌కు రావలసిన సాగు నీరు రావటం లేదు. తక్కువ నీటితో పంటలు పండించాలనే వెదసాగు చేశాం. ఇప్పటి వరకు ఒక్క తడి కూడా నీరు పెట్ట లేకపోయాం. సాగునీరు ఇచ్చి పైర్లను బతికించాలి.

– మద్దిబోయిన మల్లికార్జునరావు, రైతు, పేరలి

ఇరిగేషన్ ఏఈకి చెప్పినా పట్టించుకోడం లేదు



సాగునీరు రాకపోవడంతో వరి మొక్కలు వాడిపోతున్నాయి. రైతులంతా ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావును కలసి పైర్లు ఎండిపోతున్నాయి.. సాగునీరు ఇవ్వండి అని అడగటంతో ఆయన వచ్చి మా పొలాలు చూసి నీరు వదులుతామని చెప్పి వెళ్లారు. అయినా కాల్వలకు నీరు రావడం లేదు. అధికారులు స్పందించి, సాగునీరు ఇచ్చి పైర్లను కాపాడాలి.

– మసనం శ్రీనివాసరావు, రైతు తుమ్మలపల్లి

ఎమ్మెల్యే వచ్చి చూసి వెళ్లినా నీరు రాలేదు



రైతులు సాగు చేస్తున్న పొలాలకు సాగునీరు సక్రమంగా వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వి.నరేంద్రవర్మరాజు చెప్పారు. ఆయన అధికారులతో కలసి వచ్చి కాల్వలను చూసి వెళ్లారు. అయినప్పటికీ నీరు రావడం లేదు. వరి మొక్కలు వాడిపోతున్నాయి.

– పి.గోవిందరెడ్డి, రైతు తుమ్మలపల్లి

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన





బాపట్ల: న్యాయవాదులపై పోలీసులు అక్రమ కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ బాపట్ల బార్ అసోసియేషన్ విధులను న్యాయవాదులు సోమవారం బహిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వి. సత్యప్రసాద్ ఆధ్వర్యంలో కొద్దిసేపు నిరసన తెలిపి న్యాయమూర్తికి వినతి పత్రాన్ని అందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. గుంటూరులో అడ్వకేట్ కమిషనర్‌పైన తప్పుడు క్రిమినల్ కేసు నమోదు చేయటం, మంగళగిరిలో తన క్లయింట్స్‌కు బెయిల్ వేసినందుకు కేసులో పేరు నమోదు చేయటాన్ని నిరసిస్తూ విధులు బహిష్కరించినట్లు అధ్యక్షుడు వి.సత్యప్రసాద్ తెలిపారు. ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయవాదులపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని మాజీ అధ్యక్షుడు భీమా లీలాకృష్ణ ఖండించారు. అడ్వకేట్ కమిషనర్‌పై తప్పుడు క్రిమినల్ కేసులు ఏవిధంగా పెడుతారని నిలదీశారు. గుంటూరు బార్ అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు తమ విధులను బహిష్కరించడం జరిగింది. ఇప్పటికైన ఈ విషయాలపై ప్రభుత్వం స్పందించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

రేపల్లె రూరల్: గుంటూరు, మంగళగిరిలో న్యాయవాదులపై పోలీసులు అక్రమంగా పెట్టిన కేసులను నిరసిస్తూ రేపల్లె బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశన వెంకట గోపాలరావు, కార్యదర్శి పి.భూషణం, సభ్యులు సూరిబాబు, కొండలరావు, జగదీష్, హరికుమార్ పాల్గొన్నారు.

ప్రజా చైతన్యం..గండికి అడ్డుకట్ట పనులు

కొల్లూరు: కృష్ణా నది అంచుల వరకు ఇష్టానుసారం చేపట్టిన మట్టి తవ్వకాల కారణంగా నదికి ఏర్పడిన గండికి స్థానిక ప్రజలే చైతన్యంగా అడ్డుకట్ట వేసే పనులు చేపట్టారు. మండలంలోని పెసర్లంక అరవింద వారధి సమీపంలో కృష్ణా నది ప్రధాన పాయ నుంచి కొల్లూరు కరకట్ట వైపు గతంలో గండి పడింది. నదిలోకి కొద్ది మొత్తంలో నీరు విడుదలైనా.. పల్లపు భూముల్లోకి వరద నీరు ప్రవహించి గ్రామాలను చుట్టుముడుతున్నాయి. అలాగే ఇటుక తయారీ కోసం చేపట్టిన మట్టి తవ్వకాల వల్ల అక్కడ ఏర్పడిన భారీ గుంతలు నిండుకుని.. కొల్లూరు, పెసర్లంక, ఈపూరు, దోనేపూడి, ఆవులవారిపాలెం గ్రామాల పరిధిలోని వేల ఎకరాలు వరద ముంపునకు గురవుతున్నాయి. పంట నష్టం వాటిల్లడంతో పాటు, ఇటుక బట్టీలు నీట మునుగుతున్నాయి. ఏళ్ల తరబడి నెలకొన్న ఈ సమస్యతో రైతులు, ఇటుక బట్టీల నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ వెంకట మురళీ దృష్టికి స్థానికులు ఈ సమస్యను తీసుకెళ్లడంతో ఆర్‌సీ అధికారులను.. గండి ద్వారా నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడానికి తాత్కాలిక, శాశ్వత అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. కానీ, ఆర్‌సీ అధికారులు ఆ విధమైన చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం కృష్ణా నదికి వరదలు సంభవించనున్న నేపథ్యంలో స్థానికులు, ఇటుక బట్టీల వ్యాపారులే గండి నుంచి నీటి ప్రవాహాన్ని అడ్డుకునేందుకు ముందుకొచ్చారు. రెండు రోజులుగా పొక్లెయిన్‌తో నదిలోని ఇసుకను అడ్డు కట్టగా పోస్తున్నారు.



పెసర్లంక అరవింద వారధి సమీపంలో ఏర్పడిన గండికి అడ్డుకట్ట పనులు

దమ్ము చక్రం..రోడ్లు ఛిద్రం



భట్టిప్రోలు: ఏటా ఖరీఫ్ సీజన్‌లో దమ్ము చక్రాల ట్రాక్టర్లు తిరగడంతో రహదారులు ఛిద్రమవుతున్నాయి. చక్రాలకు ప్రత్యేకంగా బద్దెలను ఏర్పాటు చేసుకుని పంట పొలాలకు తీసుకెళ్లిన తర్వాత బద్దెలు తీసి వేస్తే ఈ సమస్య ఉండదు. ఇనుప చక్రాలకు తోడు వాటికి ఉండే బురద రహదారిపై పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కేజ్‌లతో ట్రాక్టర్లను రోడ్లపై తిప్పితే చర్యలు తీసుకుంటామని ఆర్ అండ్ బీ, రెవెన్యూ శాఖ ప్రకటనలు..ప్రకటనలుగానే మిగిలిపోతున్నాయి.

వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

నిజాంపట్నం (రేపల్లెరూరల్): నాటు సారాకు ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేసిన ఘటన నిజాంపట్నం మండలం జంపనివారి పాలెంలో సోమవారం చోటుచేసుకుంది. నగరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ వివరాల మేరకు.. తమకు అందిన సమాచారంతో జంపనివారి పాలెం గ్రామంలో తమ సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. దాడులలో నాటు సారాకు ఉపయోగించే 1000 లీటర్ల బెల్లం ఊట లభ్యమైందని చెప్పారు. దీనిని ఆ ప్రదేశంలోనే ధ్వంసం చేశామన్నారు. నిషేధి వస్తువులైన నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. బెల్లం ఊట తయారు చేసినది ఎవరన్నది దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దాడులలో హెడ్ కానిస్టేబుల్ చిలక రాజు, కానిస్టేబుల్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల పోరాట ఫలితమే స్వాతంత్య్రం



జమ్స్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులతో సంగిరెడ్డి హనుమంతరెడ్డి, తదితరులు

పెదకాకాని: మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితమే స్వాతంత్య్రమని ఉపన్యాసకుడు సంగిరెడ్డి హనుమంతరెడ్డి చెప్పారు. పెదకాకాని మండలం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న జెమ్స్ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు భారత స్వాతంత్ర ఉద్యమంపై అవగాహన కలిగించారు. కార్యక్రమానికి అవర్ స్టేట్ అవర్ లీడర్ అండ్ ఇండియన్ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు జి శాంతమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి, ఉపన్యాసకులు సంగిరెడ్డి హనుమంతరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు స్వాతంత్ర్య పోరాటంలోని వివిధ ఘట్టాలను వివరించారు.

ప్రజల అర్జీలకు నిర్ణీత వ్యవధిలో పరిష్కారం

తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్

తెనాలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల సమావేశానికి మొత్తం ఎనిమిది అర్జీలు వచ్చాయి. తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులకు అర్జీలను పంపి, నిర్ణీత వ్యవధిలోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. రెవెన్యూకు సంబంధించి రెండు అర్జీలు, మున్సిపల్ విభాగానికి మరో రెండు అర్జీలు రాగా, వ్యవసాయం, గృహనిర్మాణం, విద్యాశాఖ, పోలీస్ విభాగాలకు సంబంధించి ఒక్కో అర్జీ వచ్చినట్లు వివరించారు.

ట్రాఫిక్ సలహా సంఘ సమావేశం జరపాలి...

పట్టణంలో పెరిగిపోతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ సలహా సంఘ సమావేశాన్ని నిర్వహించాలని తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం నాయకులు సబ్ కలెక్టర్‌కు కలిసి వినతిపత్రం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్, డీఎస్పీ, పోలీస్, మోటారు వాహనాల అధికారులు, మున్సిపల్ కమిషనర్, వివిధ శాఖల అధికారులు, ప్రజా సంఘాల సమక్షంలో జరిగే ట్రాఫిక్ సలహా సంఘ సమావేశం రెండున్నరేళ్ల క్రితం జరిగిందని గుర్తుజేశారు. నిబంధనల ప్రకారం ఈ సమావేశాన్ని ప్రతి మూడు నెలలకోసారి జరపాల్సి ఉందన్నారు. సంఘం అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు, కార్యదర్శి నారాయణం కమల్‌కుమార్, కోశాధికారి అబ్దుల్ ఆరిఫ్, ఉపాధ్యక్షుడు రావూరి శివశంకరరావు, డీవీ సోమయ్యశాస్త్రి పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అభివృద్ధి సంఘం నేతలు

ఇళ్ల నిర్మాణ బిల్లులు ఇప్పించాలి...

జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు తాను చేసిన ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పెండింగు బిల్లులను ఇప్పించాలని కోరుతూ పట్టణ 24వ వార్డుకు చెందిన కాంట్రాక్టర్ ఎం.పున్నారావు సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సచివాలయం సిబ్బంది తనను ఈ పనికి పురమాయించారని, వారు చెప్పిన ధర తనకు గిట్టుబాటు కాదని, ఒక్కో ఇంటికి అదనంగా రూ.10 వేలు ఇప్పించాలని కోరగా, తర్వాత చూద్దామని చెప్పి, తనతో నిర్మాణ పనులు ఆరంభించారని తెలియజేశారు. దీనిపై గృహనిర్మాణ సంస్థ అధికారిని వివరణ కోరారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తీర్మానం లేకుండా డబ్బులు డ్రా చేశారు

తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన డ్వాక్రా మహిళలు

ప్రత్తిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి స్పందన లభించింది. పలు గ్రామాల నుంచి ప్రజలు రకరకాల సమస్యలపై తహసీల్దార్ కె.రవిబాబును కలిసి తమ గోడును వినిపించారు. సానుకూలంగా స్పందించిన ఆయన నిర్దేశిత గడువులోపు సమస్యలకు పరిష్కార మార్గాలను చూపించడం జరుగుతుందని అర్జీదారులకు భరోసానిచ్చారు. ఇటీవల జరిగిన భూముల రీ సర్వే సమయంలో తమ భూముల విస్తీర్ణంలో వ్యత్యాసాలతో పాటు చిన్నచిన్న సమస్యలు తలెత్తినట్లు నలుగురు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఇతరత్రా సమస్యలకు సంబంధించి మరో రెండు అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు.

– ప్రత్తిపాడుకు చెందిన పిరానే పీర్ డ్వాక్రా గ్రూపు మహిళలు మీ కోసంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తమకు తెలియకుండా రూ. 86,010 తమకు పొదుపు ఖాతా నుంచి సీసీ లోన్‌కు జమ చేశారని, అదేవిధంగా తాము తీర్మానం చెయ్యకుండా రూ. 3,36,000 అప్పు పుస్తకం నుంచి డ్రా అయ్యాయని, దాని వలన తామంతా అధిక వడ్డీ చెల్లించాల్సి వస్తుందని వాపోయారు. తమ తీర్మానం పుస్తకాల్లో గ్రూపు సభ్యుల సంతకాలు కూడా ఫోర్జరీ చేసి ఉన్నాయని తహసీల్దార్‌కు వివరించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ వెంటనే వీరిపై క్రిమినల్ కేసు పెట్టమని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. తాను కూడా ఎస్ఐతో మాట్లాడుతానని తహసీల్దార్ బాధితులకు చెప్పారు.



మీ కోసంలో తహసీల్దార్ కె.రవిబాబుకు ఫిర్యాదు చేస్తున్న డ్వాక్రా మహిళలు

ఐలవరంలో తులసీదాస్ జయంతి

ఐలవరం(భట్టిప్రోలు): పరమ రామభక్తుడైన తులసీదాస్ జయంతిని సోమవారం ఐలవరం గ్రామంలో కొలువైన శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలను దేవాలయ ప్రధాన అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి శాస్త్రోక్తంగా జరిపారు. ఈ సందర్భంగా హనుమాన్ ఛాలీసా పారాయణం, భజన సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్ఎస్ఎఫ్ జిల్లా పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు తులసీదాస్ గొప్పతనాన్ని భక్తులకు తెలియజేశారు. మంగళగిరికి చెందిన అందె రవీంద్ర సహకారంతో అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, వేల్పూరి శ్రీనివాసరావు, బి.వీరరాఘవయ్య, ఆర్ఎస్ మోహన్‌రావు, వి.కోటేశ్వరరావు, కేబీవీ రమణ, కె.శివశంకరరావు సిద్ధాంతి, సుబ్రహ్మణ్య ప్రసాద్, కె.వాణి పాల్గొన్నారు.



ఐలవరంలో భజన సంకీర్తన

ఫార్మసీ కళాశాలలో ముగిసిన 'యు నెక్ట్స్'

బాపట్లటౌన్: ఫార్మసీ కళాశాలలో గత నెల రోజుల నుంచి బెంగుళూరు చెందిన ఉన్నతి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న యునెక్ట్స్ శిక్షణ కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు, జీవన నైపుణ్యాలు, నైతిక విలువలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో శిక్షణ తరగతుల చేంజ్‌మేకర్ కె.రామకృష్ణారెడ్డి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన ఫార్మసీ కళాశాల విద్యార్థులు

ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణపై శిక్షణ

పొన్నూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ(పాఠశాల యాజమాన్య కమిటీ)ల ఏర్పాటుకు సర్వం సిద్ధమైంది. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8న మండలంలోని 88 ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీలను ఎన్నుకునేందుకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎన్నికల నిర్వహణపై మండల విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ఎన్నికలు ఎలా నిర్వహించాలనే అంశంపై ఎంఈఓ శ్రీనివాసరెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ వి.హెచ్.ప్రసాద్, నోడల్ హెచ్ఎం వై.ఎస్.సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు



కర్లపాలెం: ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఆహార దిగుబడులను పండించుకోవచ్చునని ఏపీ సీఎస్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ గంజి శ్రీకాంత్ తెలిపారు. సోమవారం దుండివారిపాలెంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహనలో భాగంగా ద్రవ జీవామృతం తయారు చేసే విధానంపై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు వేయడం వల్ల భూములు నిస్సారవంతమవుతున్నాయని చెప్పారు. సేంద్రియ ఎరువులు, కషాయాలు వాడుకోడం వల్ల నాణ్యమైన పంటలు పండించుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం బుద్ధాం యూనిట్ ఇన్‌చార్జ్ ఎన్.సత్యనారాయణ, ఐసీ ఆర్పీలు భారతి, నందిని భూలక్ష్మి, శ్యామ్యూల్, రైతులు పాల్గొన్నారు.